"సిగ్నల్ పడింది సార్!" అని వెనక నుంచి ఎవరో అరిచే సరికి అన్యమనస్కంగా ఉన్న శరత్ ఆగిపోయిన స్కూటర్ స్టార్ట్ చేసి ముందుకు పోనిచ్చాడు.

**ఉదయం నుంచి శరత్ మనసు మనసులో లేదు. ఏదో కోల్పోతున్న భావన వెంటాడుతోంది. ఏమిటో మరి?**

**మొదటి నుంచి వెంటాడిన చికా కనుకున్నాడు. చికాకు కాదని తెలిసింది.**

సుమిత్రతో పెళ్లయి మూడు నెల లయ్యింది. అన్ని విధాలా ఈడూ, జోడూ అని పెళ్లి కొచ్చిన వాళ్లందరూ అన్నారు. ఏ విషయంలోనూ క్రితం రాత్రి దాకా ఏ తేడా రాలేదు. క్రితం రాత్రి ఎలా వచ్చిందో అర్థం కాలేదు.

కొత్తగా పెళ్లయిన వాడని ఆఫీసులో తొందరగా వదిలేసే వారు. కొన్ని రోజులైతే మధ్యాహ్నం ఇంట్లోనే గడపడం. అలాంటిది క్రితం రోజు -

ఏదో రిపోర్టు హెడ్డాఫీసుకు పంపాలని ఆఫీసర్ ఉండ మన్నాడు. అడగకుండానే పర్మిషన్లు ఇచ్చి నాయన 'పని' అడిగే సరికి కాదనలేక పోయాడు.

వేరే వాళ్లకు ఆ పని గురించి అంతగా తెలీక పోవడం వల్ల తానే ఉండి పోవలసి వచ్చింది.


పి.పి. నంబర్ వాళ్లకు ఫోన్ చేసి, సుమిత్రకు ఆలస్యంగా వస్తున్నట్టు చెప్పమన్నాడు. వాళ్ల చెప్పారు. సుమిత్ర ఏమీ అనలేదు.

కాక పోతే ఆఫీసులో రిపోర్టు పని పూర్తి చేసి ఇంటికి వెళ్లే సరికి దాదాపు తొమ్మి దయింది.

వేడి నీళ్ల స్నానం చేయడానికి సిద్ధం చేసినా, ఓపిక లేకపోవడంతో మొహం మాత్రం కడుక్కున్నాడు.

భోజనం దగ్గర - "పొద్దున్న పదార్థాలేనా?" అని విసుగ్గా మొహం పెట్టాడు.

ఇష్టమైన పదార్థాలను రెండు పూటలకూ చేయమని మరీ మరీ చెప్పేడని చేస్తే, పొద్దున్న



పదార్థాలేనా అనే సరికి చివుక్కుమంది సుమిత్రకి. ఏమీ మాట్లాడలేదు.

భోజనాలు పూర్తయ్యాయి.

వెన్నెల ఆకాశం లోంచి పిచికారీ చేస్తున్నట్టు కురుస్తోంది. పక్క సిద్ధ మయ్యింది. మల్లె పూల వాసన మత్తుగా వొస్తోంది. అలసట వల్ల పక్క దగ్గరికి చేరగానే నడుం వాల్చేడు. సుమిత్ర వంటిల్లు సర్దుకుని వచ్చే సరికి అటు తిరిగి పడుకుని ఉన్నాడు.

సుమిత్ర అటు తిరిగి పడుకుని ఉన్న శరత్ దగ్గరగా వచ్చి గిలిగింతలు పెడ్తున్నట్టు నడుమ్మీద మెల్లగా గిల్లింది.

నిద్రలోకి జారి పోయిన శరత్ ఉలిక్కిపడి - "ఏయ్!" అని అరిచాడు.

పక్క వాటా వాళ్లు వింటా రన్నంత కంగారు పడింది సుమిత్ర.

"ఏం కొంప మునిగింది? తేలు పాకిం దనుకున్నాను" అని విసుక్కున్నాడు.

ఏం జవాబు చెప్పాలో తెలీలేదు. మాటలు రానట్టు నిలబడి పోయింది.

"మాట్లాడు. పాటలు పాడతావుగా, మాటలు రావా?" అని మొదలు పెట్టి చెడిపోయిన నిద్ర కోపం సుమిత్ర మీద చూపెట్టాడు.

'రసభంగం' అయింది. ఒకే మంచం మీద పడుకున్నా అటు చివర ఒకరు, ఇటు చివర ఒకరు. భార్యాభర్తల్లా కాకుండా బద్ధశత్రువుల్లా తయారైనట్టనిపించింది.

ఓ రాత్రి వేళ -

శరత్‌కు మెలకువ వచ్చింది.

అప్పటి దాకా హఠాత్తుగా మారిన భర్త ప్రవర్తనకి బాధ పడి, అప్పుడే నిద్ర పోయిన సుమిత్ర, శరత్ చేతులు పడేసరికి "ఏయ్!" అని అరిచింది.

ఆ వెంటనే "ఏం కొంప మునిగింది? తేలు పాకిందనుకున్నాను" అంది.

శరత్ అహం దెబ్బ తింది. అంటే అటు ఒకరు - ఇటు ఒకరు.

పొద్దున్నే సుమిత్ర పలకరించే ప్రయత్నం చేసినా శరత్ 'అహం' సంతృప్తి పడ లేదు. అందుకే మాట్లాడ లేదు.

"మాట్లాడక పోయినా మీ పని మరిచి పోకండి' ' అని, గుమ్మం లోంచి బయటకు వెళ్తుంటే "ఓ పని మరిచి పోయారు" అంది. వినిపించుకోనట్టుగా వచ్చేశాడు.

ఏవిటా పని? తలుపుచాటున రోజా ఇచ్చే ముద్దే కదా! స్కూటర్ స్టార్ట్ చేసినప్పుడు మరోసారి పిలుపు వినిపించినా వెనక్కి తిరగలేదు!

00 00 00

"ఆఫీసర్ గారు పిలుస్తున్నారు" లంచ్ టైంకి బయటకు వెళ్దా మనుకుంటున్న శరత్ ఆగాడు. ఏదో ఇన్ఫర్మేషన్ కావల్సి ఉంటుంది. 'ఎంత ఇన్ఫర్మేషన్ ఇచ్చినా పానకాలరాయుడిలా స్వాహా చేస్తున్నాడు' అనుకుంటూ అటు కదిలాడు.

లోపలికి వెళ్లిన శరత్‌ను కూర్చోమన్నట్టు సైగ చేశాడు, ఫోన్లో మాట్లాడుతూ. ఆ తరువాత "కంగారు పడకోయ్! ఇన్ఫర్మేషన్ ఏదీ అడగను. ఆఁ ఇందాకా నువ్వు ఇచ్చిన ఇన్ఫర్మేషన్ని నీ మీద నమ్మకంతో కంప్యూటర్లో ఫీడ్ చేయ మన్నాను. ఫీడ్ చేశాక ప్రింట్ అవుట్ తీస్తే ఓ బ్లండర్ ఇచ్చింది. లక్షల్లో ఇవ్వాల్సిన అంకెలు కోట్లలో ఇచ్చాము. అఫ్‌కోర్సు, రెక్టిఫై చేశా ననుకో" అని, "ఇఫ్ యూ డోంట్ మైండ్, ఓ పర్సనల్ క్వశ్చన్ ..." అంటూ ప్రశ్నార్థకంగా చూశాడు.

"అడగండి సార్!"

"ఏమైనా తేడాలు వచ్చాయా?"

అర్థం కానట్టు చూశాడు.

# 'మనస్సులో చోటు'

## ఆకెళ్ళ శివప్రసాద్

"చెప్పవోయ్, మొహమాటపడకు!"

చెప్పేయా అనుకున్నాడు. మరుక్షణంలో చెప్పడానికి ఏముంది - అనిపించింది. ఒక వేళ వెలితి ఉన్నా ఎలా చెప్పాలి? అసలు ఉన్న దేమిటి?

"ఏం లేదండి ... ఏం లేదు" తడబడ్డాడు.

"తల పండిపోయిన వాళ్లమోయ్ మేము! ఎత్తు తక్కువై నీకు ఆఫీసరయ్యాను కానీ పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఉండాల్సిన వాణ్ని. అంచేత అబద్ధ మాడకు!" తివాచీలా నున్నగా ఉన్న తల మీద ఉన్న పన్నెండు వెంట్రుకలూ పరుచుకుంటూ అన్నాడు.

ఆఫీసర్ ఎప్పటి కప్పుడు ఫ్రెష్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తాడు. గంటకో సారి సబ్బుతో మొహం కడుక్కుని, అర గంట కో సారి పౌడర్ అద్దుకుంటాడు. ఎప్పుడూ 'గ్లామరస్'గా ఉండే ప్రయత్నంలో 'లాఫింగ్ స్టాక్' అయ్యాడు.

"అబ్బే ఏమీ కాలేదండి." అదే మాట అన్నాడు, ఇబ్బందిగా మొహం పెట్టి బలవంతంగా నవ్వు తెచ్చుకుంటూ.

"నవ్వు రానప్పుడు నవ్వే ప్రయత్నం చేయడం ఏదో పళ్ల పొడిని ఫేస్ పౌడర్‌లా రాసుకున్నంత అపచారం. అంచేత విషయం చెప్పు. అదీ అభ్యంతరం లేక పోతేనే. కొత్తగా పెళ్లయిన వాడివి. సంసార బాధల్లో ఆసాంతం కూరుకుపోయినా, నేను ఎంత యాక్టివ్‌గా ఉంటున్నానో చూడు!" అన్నాడు.

శరత్ ఏమీ మాట్లాడ లేదు.

"రైటో. నీ ఇబ్బంది నేను ఊహించ గలను. కరకరా మండుతున్న లంచ్ టైంలో అప్పడంలా నమిలేస్తున్నా ననుకోకు" అని బెల్లు కొట్టి, "డబుల్ మీల్స్" అని చెప్పి - "ఆఁ ... విషయ మేమి టంటే, రెండు మాటలు నా అనుభవం లోంచి చెప్తాను. నా మాటల్లో బహుశా నీ 'అవుటాఫ్ మూడ్'కి జవాబు దొరకొచ్చు. జవాబు దొరికితే తిన్నగా ఇంటికి వెళ్లు. ముందుగానే పర్మిషన్ ఇస్తున్నాను. దొరక లేదూ, చెప్పక తప్పదు!" మొహంలో మొహం పెట్టాడు.

జవాబు చెప్ప లేదు.

"సే ఎస్ ఆర్ నో!"

"ఎస్సార్ ..." కంగారుగా అన్నాడు.

"బాస్ ఈజ్ ఆల్వేస్ రైట్. బాసంటే నేను కాదు, అనుభవం" అని చిత్రంగా నవ్వి కొనసాగిస్తూ,

"పెళ్లయిన కొత్తలో మానసికంగా ఒకరి నొకరు అర్థం చేసుకోవడానికి కొంత కాలం పడుతుంది. ఈ లోపు చిన్న చిన్న ఇబ్బందులు, ఇగో క్లాషులు వస్తాయి. అవి కావాలని కావచ్చు. కాక పోవచ్చు. రెండు హృదయాలను అతికించడానికి 'ఫెవికాల్' లాంటిది లేదుగా! తప్పు ఒప్పు కాదు. బంధ మంటే ఒప్పందం. ఇగోలకు చోటు లేదు. నీ కో తమాషా చెప్పనా?"

"చెప్పండి."

"నాకు పెళ్లయి పాతి కేళ్లయింది. సిల్వర్ జూబ్లీ చేసుకున్నాను. ఇప్పటికీ నా భార్యా, నేనూ ఒకే మంచ మ్మీద ఒకే దుప్పటి కప్పుకుని పడు కుంటామని చెప్పుకోవడానికి గర్వపడుతున్నాను. నిజంగా అదో వరం. ఎందుకో తెలుసా? ఎన్ని తేడాలు వచ్చినా దుప్పట్లో చేరాక మాయమై పోవాలి. తేడాల్ని భూతద్దంలో చూడొద్దు. వీణ తీగ కూడా కత్తిలా కనిపిస్తుంది" అని కిలకిలా నవ్వి -

"నేను ఇన్ని మాటలు చెప్తున్నా ఎక్కడో ఉంది నీ మనసు! ఆఁ .. మన సంటే గుర్తు కొచ్చింది. నీ కో విషయం చెప్పనా? మనసిచ్చి వరించిన వాళ్లకు, మనకు తెలీకుండా మన మనసులో ఓ చోటు ఏర్పడుతుంది. ఆ చోటు చాలా చిత్ర మైనది. అభిమానంతో వాళ్లతో గడిపినంత కాలం ఎక్క డుందో కూడా తెలీదు. పొరపాట్న చిన్న విభేదం వచ్చినా పెద్ద సున్నాలా బాధ ఏర్పడుతుంది. అప్పు డేం చేయాలో తెలుసా? అమాంతం 'ఇగో'ను వదిలేసి ఆ చోటును మనకు తెలీకుండా ఆక్రమించుకున్న వాళ్లను అక్కున చేర్చుకోవడంతో పూరించాలి. ఒకే ఒక దుప్పటిలో దూరి పోవాలి ...' ' ఆఫీసర్ వాక్యం పూర్తి కాకుండానే శరత్ బయటికి నడిచాడు.

అతనిప్రశ్నకు జవాబు దొరికింది.

భార్యను ఊహించుకుంటూ 'డబుల్ మీల్స్' లాగించే ప్రయత్నంలో పడ్డాడు ఆఫీసర్.

(P)